కావ్యయోగంలో కాంతిహోమం

కోకిల కలకూజితాలూ, మయూరి నాట్యవిన్యాసాలూ, సెలయేళ్ళ మంజీర శింజితాలూ, వాసంత సమీరాలూ, తుమ్మెదల ఝుంకారాలూ, ప్రియురాళ్ళ మధురాధరాలూ, పుష్పసౌరభాలూ, శరజ్జ్యోత్స్నలూ, మధురాసవాలూ, విరహగీతికలూ – ఇవన్నీ గుండెల్లో పొదువుకొని, నరాల్లో నింపుకొని, రక్తంలో జీర్ణించుకొని ఇంతకుపూర్వం ఎన్నో అపూర్వ శృంగార ప్రబంధాల్ని నిబంధించిన కవికుమారులు ఈ రోజున ఎందుకో మౌనంగా కనులు మూసుకొని తీవ్రంగా ఏదో ఆలోచిస్తూ ఉన్నారు.

రాజసభనుంచి తిరిగి వచ్చినప్పటినుండి, కవిలో వచ్చిన మార్పేమిటో అర్థం చేసుకోలేక, అలాగని ఆ స్థితిలో ఆయనను పలకరించి 'సంగతేమిటి' అని ప్రశ్నించే ధైర్యమూ లేక నిస్సహాయంగా ఆయనకేసి చూస్తూ ఉండిపోయింది రేఖ.

తూగుటుయ్యాల మీద ఒయ్యారంగా పడుకొని ఊహాలోకాల్లో ఊగుతూ రసజగత్తులో విహరిస్తూన్న కవికుమారుని యౌవనశ్రీని కళ్ళతోనే ఆస్వాదిస్తూ సమీపంలో ఆసనంమీద ఆసీనురాలై ఉంది రేఖ. పాము కుబుసంలాంటి ఉత్తరీయంలోంచి ఆయన సుకుమార దేహకాంతి వింత రంగుల్ని విరజిమ్ముతోంది. తనకు శాంతినీ, విశ్రాంతినీ

ఇచ్చే ఆ విశాలమైన వక్షస్థలం ఉచ్ఛ్వాస నిశ్వాసల కారణంగా ఉత్తమస్థితినీ, సామాన్యస్థితినీ పొందుతోంది. సౌందర్యానికి ప్రతీకగా నిలిచిన ఆ అందమైన ముఖం. అందులో ముఖ్యంగా ముఖానికే కాకుండా మొత్తం మూర్తికంతటికీ కూడా అపూర్వమైన అందాన్ని అందిస్తూన్న విశాలమైన నేత్రాల్ని చూస్తూ పరవశత చెంది అలాగే ఉండిపోయింది రేఖ. అరవిచ్చిన అరవిందాల్లా అరమోడ్పుగా ఉన్న ఆయన కళ్ళవేపు ఎంతసేపు చూసినా ఇంకా చూడాలనిపిస్తోంది. నిజానికి తాను ఆయనవైపు ఆకర్షించబడటానికి ఆయన కళ్ళే కారణం. ఈ సృష్టిలో ఉన్న సౌందర్యం అంతా కలబోసి బహుశా ఆయన కళ్ళు చేశాడేమో భగవంతుడు! ఒకప్పుడు ప్రేమగా, ఇంకొకప్పుడు తీక్షణంగా, ఒక్కొక్కసారి లాలనగా, మరొకసారి గంభీరంగా - ఇలా ఎన్ని రకాలుగానో హొయలుపోయే ఆయన చూపులు ఎప్పుడూ అందంగానే కనిపిస్తాయి రేఖకి. పుడమికి అవ్వలి వెలుగుల్ని దర్శించే ఆయన నేత్రాలు ఎప్పుడూ ఏవో ఆలోచనల తరంగాల మీద విహరించే రెండు పూల పడవల్లా కనిపించేవి రేఖకి.

కవి కొద్దిగా కదిలేరు. ఆలోచనలనుంచి తేరుకొంటున్నట్టున్నారు. ప్రభుపువారి కొలువుకు వెళ్ళి వచ్చిన తర్వాత తనతో ఒక్కసారయినా మాట్లాడలేదు. ఆస్థాన పండితులు ఆ ఉదయం వచ్చి "ప్రభువుగారు తమ దర్శనం కోసం సభలో వేచి ఉన్నారు. అవశ్యం అయిన విషయం ఏదో మీతో ముచ్చటించాలట. మీరు ఆలశ్యం చేస్తే

తామే వచ్చేలాగ ఉన్నారు” అని చెప్పేసమయానికి తనతో కవి ఎంతో సంతోషంగా మాట్లాడుతున్నారు.

లేత తాములపాకులకు పాలమీగడ లాంటి సున్నం రాసి చిలుకలు చుట్టుతున్న తన్ను చూసి నవ్వుతూ “నే నిప్పుడు ఒక చక్కని శృంగార కావ్యానికి శ్రీకారం చుట్ట బోతున్నాను. నూతన కావ్యారంభంలో కవికి కస్తూరి తాంబూలం సమర్పించడం సాంప్రదాయం. త్వరగా తాంబూలం ఇయ్యి” అన్నారు కవి.

తను నవ్వి “అలాగే – కాని – ఈ లోగా నాదో చిన్న కోరిక” అంది తల వంచుకొని.

“సిగ్గుపడతావేం - చెప్పు” అన్నారు ఆయన.

“ఈ కావ్యం నేను రాస్తాను. మీరు చెబుతూ ఉండండి.”

“నువ్వు రాస్తావా?... ఎప్పుడూ లేంది ఈ కోరి కేమిటి నీకు?” అన్నారు ఆశ్చర్యంగా.

తను చిన్నబుచ్చుకుంది.

వెంటనే ఆయన తనని అనునయిస్తూ “అలాగేలే– నువ్వే రాద్దువుగాని” అన్నారు.

కాని తాను ఆయనకి తాంబూలం సమర్పించుకోనే లోగానే ఆస్థాన విద్వాంసులు రావడం, ప్రభువు పంపిన కస్తూరి తాంబూలం కవిచేతిలో పెట్టి ప్రభువువారి ఆజ్ఞ తెలిపి ఆయనని తమతో తీసుకొని వెళ్ళిపోవడం జరిగింది. ఆ వెళ్ళడం వెళ్ళడం ఇప్పుడు వచ్చారు సభనుండి కవి.

వచ్చినప్పటినించీ హైరానంగా ఉన్నారు. రేఖకేమీ పాలు పోవడంలేదు.

కొంచెంసేపటికి లేచి కూర్చుని రేఖవైపు శూన్యంగా కొన్ని క్షణాలు చూసి నిట్టూర్చారు ఆయన. రేఖ భయంతో "ఏమిటలా ఉన్నారు? ఏంజరిగింది?" అంది. "అంతా చెప్తాను. ముందు నాకు కొంచెం మంచినీళ్లు తే" అని, అవి తీసుకున్నాక కొంచెం స్థిమితపడి, ఇలా చెప్పడం మొదలుపెట్టారు.

"ప్రజలలో నీతి నియమాలూ, పాపభీతీ, ధర్మ చింతనా క్రమంగా సన్నగిల్లిపోతూండడం గురించి ప్రస్తా వించి ప్రభువు ఇలా అన్నారు. "విశృంఖలంగా ప్రవహి స్తూన్న ఈ ప్రజా జీవనవాహిని ఏ ప్రమాదమైన గమ్యా నికి చేరుతుందో అని భయంగా ఉంది. నానాటికీ పెచ్చు పెరిగిపోతున్న ఈ అవినీతీ, ఆర్థికప్రలోభం, ఆశ్రిత పక్ష పాతం అరికట్టాలని ఎన్నో శాసనాలు చేశాను. ఎన్నో శిక్షా స్మృతులు ప్రకటించాను. కాని, ఏం లాభం లేకపోయింది. నా చట్టాలన్నీ తాత్కాలికంగానే పనిచేస్తున్నాయి కాని శాశ్వతమైన మార్పుని తేలేకపోతున్నాయి. ఆ మార్పు హృదయ పరివర్తనంవల్ల రావలసిందే కాని భయపడితే రాదు. అందువల్ల దూరం ఆలోచించి మిమ్మల్ని పిలిపిం చాను. ఈ సోదర ప్రజానీకం కళ్లు తెరిపించి వాళ్లను ఋజు మార్గంలో పెట్టే మహాకావ్యం ఏదైనా వ్రాయండి. ఇది మీకుతప్ప ఇతరులకు సాధ్యంకాదు."

నేనేమీ సమాధానం ఇవ్వకపోవడం చూసి "మీ రిలా మౌనం వహిస్తే కాదు. ఇది ప్రజాహిత కార్యం. మీరీ యుగానికి నాయకత్వం వహించక తప్పదు" అన్నారు.

అప్పుడు నేను "క్షమించండి. కవిత్వం బలవంతం మీద వచ్చేదికాదు. పైగా నాకు శృంగారకావ్యాలే వ్రాయడం అలవాటు. కాని, ఈ రకమైన ప్రబోధాత్మక కావ్యాలు వ్రాయడం అలవాటు లేదు. కాదూ కూడదని ప్రభువులు ఆజ్ఞాపిస్తే, మరి తప్పుతుందా?" అన్నాను తీవ్రంగా.

దాని కాయన ఇది ఆజ్ఞకాదు అభ్యర్థన" అన్నారు.

ఇంక నేనేమనను? "సరే - ప్రయత్నిస్తాను" అంటూ సెలవు తీసుకొని వచ్చేశాను"—

అంతా విని రేఖ నిట్టూర్చి "అయితే మిమ్మల్ని ఒక ప్రబోధాత్మక కావ్యం వ్రాయమన్నారన్న మాట!" అంది. కవి 'అవున' న్నట్లు తల ఊపారు.

"ప్రబోధాత్మకమైనది ఒక నీతిశాస్త్రం అవుతుంది కాని దానికి కావ్యత్వం ఎలా సిద్ధిస్తుంది?" అంది రేఖ.

"అదంతా వారికెందుకు? శాసించడమే వారివంతు."

"నిరంకుశాః కవయః అన్నది ప్రభువులు మరిచి నట్లున్నారు. ఊ - మరి అయితే ఏం చెయ్యదలిచారు?"

"ఇంకా ఏమీ నిర్ణయించలేదు. సూర్యాస్తమయాల సౌందర్యాలూ, వాసంత వనాంతర దివ్యశోభలూ, ప్రియు రాలి ప్రేమగీతాలూ అయితే నా కవితాపాటవాన్ని ప్రద ర్శించి నా భావాలకు అక్షరరూపాలు అమర్చగలనుకాని,

కర్షకుని ఘర్మజలం, దరిద్రుని ఆకలిబాధ, పతితస్త్రీ మనో వ్యథ – ఇవి నాకు పరిచయంలేని వస్తువులు. సామాన్య మానవ జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఇవన్నీ వర్ణించా లంటే ఎంతో తీవ్రంగా ఆలోచించాలి. ఎంతో నిశితంగా పరిశీలించాలి. మరెంతో లోతుగా అనుభవించాలి. చాలా శ్రమతో కూడుకున్న సంగతి. శారీరకంగానూ, మానసికం గానూ కూడా విపరీతంగా మథనపడితేనే కాని, ఈ నూత్న కవితామృతం ఉద్భవించదు.”

కొంతసేపటివరకూ ఇద్దరూ మౌనంగా ఉన్నారు.

తరువాత కవి “నా కిదంతా ఆలోచి ఉంటేనే మెదడు వేడెక్కి తలపోటు వస్తోంది. గంధంతీసి పన్నీటితో కలిపి తీసుకురా. కణతలకి వేసుకోవాలి” అన్నారు.

రేఖ లోపలికి వెళ్ళింది.

కవి ద్వారంగుండా వీథిలోకి చూస్తూ ఆలోచిస్తు న్నారు. ఒకవేళ తానీ కావ్యాన్ని వ్రాయడం తప్పకపోతే ఏంచెయ్యాలి? శృంగార కావ్యాల్లాగ, దీనిని మందిరం లోనే కూర్చుని, కేవలం తన ఊహాబలంతోనే సృష్టించ డానికి వీలులేదు. ప్రజలలోకి వెళ్ళాలి తాను. వాళ్ళ కష్ట సుఖాల్ని గమనించి అవన్నీ తనవిగా అనుభవించాలి. తాను దర్శించినవారి జీవితసత్యాలకి ఒక కావ్యత్వాన్ని కల్పించి ప్రదర్శించాలి. ఇందుకోసం ప్రజ లుపయోగించే భాషనే తాను వాడాలి. అయితే ఇదంతా జరగడానికి, తనకి ప్రోద్బలం కలిగించి తనలో కవితావేశాన్ని రగుల్కొల్పగల

రసవద్సంఘటన లభించాలి. అది ఈ సామాన్య ప్రజా జీవితంలో ఎక్కడ దొరుకుతుంది?

ఇలా ఆలోచిస్తున్న కవికి అంతరాయం కలిగింది వీధిలోనుంచి ఆక్రందనలూ, ఆర్తనాదాలూ వినిపించేసరికి లేచి వీధిలోకి వెళ్ళారు. పాపం, రంగయ్యశెట్టి ఏకైక పుత్రుడు ఇరవై ఏళ్ళవాడు హఠాత్తుగా గుండె ఆగి చనిపోయాడట! పైగా దారుణమైన సంగతేమిటంటే, ఆరోజు రంగయ్యసెట్టి షష్టిపూర్తి మహోత్సవం. బంధుమిత్రులంతా కలిసి సంపన్నుడైన రంగయ్యసెట్టిని గులాబీదండలతో గౌరవిస్తున్న సమయంలోనే ఈ విషాదకరమైన సంఘటన జరిగింది. ఆ దండలతోటే కొడుకుశవాన్ని అలంకరించి శ్మశానానికి తీసుకు వెళ్ళవలసి వస్తుందని పాపం, రంగయ్యసెట్టి కలలోనైనా అనుకున్నాడా?

కవికి కళ్లు చెమర్చాయి. శరీరంతోపాటు మెదడు కూడా సలసల కాగిపోసాగింది. తలనెప్పి విపరీతం అయింది. లోపలికి వచ్చి నిశ్చేష్టుడై కూర్చుని ఉండిపోయారు. 'ఇదేమి సంఘటన భగవంతుడా! రంగయ్యసెట్టి ఏం మహాపాపం చేశాడని అతనికింత శిక్ష?...ఇవాళతనికి ఇంత కడుపుకోత కలిగిందంటే దానికి అతను చేసిన మహాపరాధం ఏమిటి?' ఇలా ఆలోచిస్తున్న కవికి క్రమక్రమంగా కొన్ని పూర్వ సంఘటనలు లీలగా జ్ఞాపకం రాసాగాయి.

వ్యాపారంలో రంగయ్యసెట్టి అంత జిత్తులమారి ఇంకొకడు లేడని ప్రతీతి. ప్రజల జీవితావసర వస్తువులు ఎన్నిమారులో దాచేసి, రూపాయికి రూపాయి లాభాలు

వేసుకొని అమ్మి, ప్రజల బాధల్నే పునాదులుగా చేసి ఎన్నో భవనాలు కట్టాడు. ఇక – విపరీతమైన వడ్డీకి ధనాన్ని అప్పు ఇచ్చి స్వాధీనం చేసుకొన్న ఆస్తులూ, కూల్చివేసిన సంసారాలూ లెక్కే లేదు. ప్రభుత్వ కోశాధ్యక్షుణ్ణి వలలో వేసుకొని తన వ్యాపారం అపారంగా అభివృద్ధి అయే అవకాశాలు సంపాదించాడు. మొన్నటికి మొన్న, సమర్థులైనవారు ఎందరో ఉండగా ఏవిధంగానూ సామర్థ్యంలేని తన బావమరిదిని వణిక్ శాఖాధికారిగా నియోగింపజేశాడు తన పలుకుబడి ఉపయోగించి.

ఈ పాపాలేనా అతని కీరోజున ఇంతటి కష్టాన్ని తెచ్చిపెట్టడానికి కారణం? భగవంతుని శిక్షాస్మృతి విచిత్రంగా కనిపించింది కవికి. వెంటనే కొన్ని నూతన సత్యాలు కూడా అర్థమైనట్లు ఆయనకు తోచింది.

ఈ ఆలోచనలతో కవికి ముచ్చెమటలూ పోశాయి. చెమట పట్టిన నుదుటిపై దక్షిణంనుంచి వచ్చిన గాలి తెమ్మెర ఒకటి సోకి ఎంతో హాయి కలిగించింది. తలనెప్పి తగ్గి మనస్సు సేదదేరింది. అంతలో రేఖ మంచిగంధం తెచ్చింది. అదిచూసి కవి నవ్వుతూ "రేఖా! ఇంక గంధం అవసరం లేదు. తలనెప్పి తగ్గిపోయింది. ఘర్మజలానికే సేదదేరడం నేర్చుకున్నాను నేను. లేకపోతే ప్రభువు నాపై మోపిన భారాన్ని నిర్వహించడం ఎలా?" అన్నారు.

కవిమాటలు కొత్తగా వినిపించాయి రేఖకి. లలితంగా, శ్రావ్యంగా ఉండే ఆయన స్వరం దృఢంగా గంభీరంగా వినిపించసాగింది. అంతవరకూ అరమోడ్పుగా

ఉంటూ వచ్చిన ఆయన కళ్లు విస్ఫారితాలై ప్రతి వస్తువునీ తీక్ష్ణంగానూ, నిశితంగానూ చూస్తున్నాయి. ఆ కళ్లల్లో ఏదో నూతనమైన కాంతి ప్రజ్వరిల్లుతోంది. తాను అమితంగా ప్రేమిస్తూ, ప్రాణంకంటే ఎక్కువగా చూసుకుంటూన్న ఆయన నేత్రాల్నీ, వాటి సౌందర్యాన్నీ తనివితీరా చూస్తూ, తన చేతిలో ఉన్న గంధం ఆరిపోయి పేరుకుపోవడాన్ని కూడా గమనించలేదు రేఖ. ఉన్నట్టుండి "ఇప్పుడే వస్తా" నంటూ పైమీద ఉత్తరీయం వేసుకొని వెళ్ళిపోయారు కవి. ఎంతో ముఖ్యమైన అవసరం ఉంటేనే కాని గడప దాటని ఆయన, ఇంత హఠాత్తుగా ఎండలో ఎందుకు వెళుతున్నట్లో !

అలా రోజూ బయటికి వెళ్ళి, కొన్ని గంటలు గడిపి వస్తూన్నారు కవి. ఇంట్లో ఉన్నప్పుడేనా ఆ పూర్వపు మందస్మితాలూ, మర్మోక్తులూ లేవు పుష్పసౌరభాలూ, మధురాసవాలూ, శరజ్జ్యోత్స్నలూ ఇప్పు డాయనకి ఏమీ అక్కరలేకపోతున్నాయి. మనిషి బాగా చిక్కి నల్లబడిపోయాడు. కాని, ముఖంలోనుంచి ముఖ్యంగా నిశితంగా చూసే ఆ కళ్లల్లోనుంచి ఏదో దివ్యకాంతి ప్రసరిస్తూ ఉంది. యజ్ఞదీక్షితుడైన సోమయాజిలా కనిపించసాగారు రేఖకి. పూర్వం చల్లని వెన్నెలలు కురిపించే సుధాకరుడయితే, ఇప్పుడు మింట మంటలు పుట్టించే ప్రభాకరుడులా కనిపిస్తున్నారు. అందుకే ఆయనను సమీపించడానికీ కాని పలకరించడానికి కాని ధైర్యం లేకపోతోంది ఆమెకి.

ఆరోజు శ్రావణ పౌర్ణమి!

చంద్రుడు సర్వకళలతోనూ ఆకాశంలో విహరిస్తూ తన నవ్వువెన్నెలలు లోకంమీద కురిపిస్తున్నాడు. తదేక దృష్టితో జాబిల్లి కేసి చూస్తూ ద్వారంగుండా లోపలికి పడు తూన్న వెన్నెల్లో సమాధినిష్ఠులై కూర్చుని ఉన్నారు కవి. ఆ సమయంలో ఆయన కళ్ళు మరీ వింతకాంతితో వెలిగిపో తున్నాయి. రేఖకు భయంవేసింది, ఆ కళ్ళ కేసి చూస్తే.

రెండు రోజుల క్రితం కవి తనతో ఇలా అన్నారు.

"ఈ నవ్య కావ్యాన్ని వ్రాయడానికై ఇన్నాళ్ళూ ప్రజల మధ్య తిరిగి, వారిజీవిత విధానాల్నీ, నైతిక విలువల్నీ మంచి చెడుల సంఘర్షణలోపడి నలిగిపోతున్న వారిశక్తి సామర్థ్యాల్నీ, తుదకు వారు ఉపయోగించే భాషనీ నిశితంగా పరిశీలించి పదిలపరిచాను. ఇక వీటి అన్నిటికీ ప్రాతినిధ్యం వహించే పూర్ణరక్త మాంసలమైన పాత్ర సృష్టి జరగాలి. అందుకు చైతన్యమూర్తి అయిన కవితావేశం నాలో ప్రవేశించాలి. ఆ సుముహూర్తం ఎప్పుడు వస్తుందా అనే ఎదురు చూస్తున్నాను. కాని, ఒక్క విషయం ఈ మహా ప్రయత్నంలో నేనొక నూతన సత్యాన్ని గ్రహించాను. నూనె త్రాగుతూ వత్తి భుజిస్తూ లోకాలకు వెలుగు ఇచ్చే దీపంలాగే, ఈ కవితాజ్యోతి కూడా కవి రక్త మాంసాల్ని ఆహుతి చేసుకుంటూ విశ్వశ్రేయస్సు కలిగిస్తోంది. ఇది ఒకయజ్ఞం. ఈ మహాయాగంలో ఏది హోమం చెయ్యవలసి వస్తుందో మరి!"

కవి అన్న ఈ మాటలు తలుచుకుంటే రేఖ శరీరం ఒక్కమారు ఝుల్లుమంది. మళ్ళీ చూడగలనో లేనో అన్న

ట్లుగా ఆయన కళ్ళకేసే చూస్తూండగా రేఖకి మాగన్నుగా నిద్రపట్టింది.

"రేఖా!" అన్న కేకకి ఉలిక్కిపడి లేచింది రేఖ. ఆ కంఠంలో ఆమెకేదో అపశ్రుతి వినిపించింది. అది పూర్వపరిచితమైన కంఠంలా అనిపించలేదామెకు. ఇంకో లోకం నుంచి వచ్చినట్లుగా అనిపించింది. కంగారుగా లేచి కవికేసి చూసింది. కళ్ళు మూసుకుని నిశ్చలంగా కూర్చున్నారాయన. ఆయనకేసే చూస్తూ ఉండిపోయింది రేఖ.

"ఏం రేఖా! ఎక్కడున్నావు!" అంటూ కళ్ళు తెరవకుండానే గాలిలో అటూ ఇటూ చేతులతో తడిమారు కవి.

"అదేవిటి? అటు తడుముతారు నేనిక్కడ కూర్చుంటే?" అంది భయంతో కూడిన ఆందోళనతో.

"ఏం లేదు. త్వరగా వ్రాత సామాగ్రి పట్రా. కవితా జ్యోతి దర్శనం అయింది. వెంటనే కావ్యం వ్రాసెయ్యాలి" అన్నారు నిశ్చలంగా అలాగే కూర్చుని.

"ఇవిగో తాటాకులూ గంటమూ. ఇక్కడ పెట్టాను" అంది రేఖ, కవి ముఖంలోకి ఆదుర్దాగా చూస్తూ. ఆయన కళ్ళు తెరవకుండానే, "నాకెందుకు? నేను చెబుతాను. నువ్వు రాయి" అన్నారు.

"నేనా?"

"అవును. ఇంతక్రితం కోరుకున్నావుగా? నీ ముచ్చట ఇలా తీర్చడం పడింది." అంటూ కావ్యాన్ని చెప్పడం ప్రారంభించారు.

◆ ◆ ◆

కథా నిలయం 1165

నాడు విజయదశమి!

ఆరోజున కవి స్వయంగా తన నూతన కావ్యాన్ని సభలో గానంచేసి వినిపిస్తారని ప్రభువూ ప్రజలూకూడా ఆశిం చారు. కాని అలా జరగలేదు. తను రాకుండా కావ్యాన్ని మాత్రమే సభకి పంపి ఊరుకున్నారు కవి.

"నేను బలవంతంగా ఈ కావ్యాన్ని వ్రాయించానని నామీద కోపం కాబోలు. అందుకే తాను రాకుండా కావ్యంమాత్రం పంపారు కవి" అని నవ్వుకొని కావ్యాన్ని చదివి వినిపించవలసిందిగా ఆస్థాన విద్వాంసుని కోరారు ప్రభువు.

శీలరహితమూ, నీతి బాహ్యమూ అయిన జీవితాన్ని గడిపి తుదకు మానసికమైన వ్యథతోనూ పశ్చాత్తాప వహ్ని తోనూ దహించుకుపోయిన ఒక సంపన్నుని జాలిగాథ అది.

ఆ కావ్యం వింటూంటే అవినీతి వర్తనులైన వ్యక్తు లకి భయంతో ఒళ్లు గుగుర్పొడవసాగింది. అన్యాయ వర్తను లకి భవిష్యత్తు భయానకంగా కనిపించసాగింది. సాధుశీలురకు అయ్యో అని హృదయం ద్రవీభూతం కాసాగింది.

కావ్యం పూర్తి అయేసరికి ప్రభువుకూ, అది విన్న అశేష ప్రజానీకానికీకూడా కళ్ళనిండా నీళ్లు నిండాయి. హృదయాలు బరువెక్కి కొంతసేపటి వరకూ ఏమీ మాట్లాడలేకపోయారు.

తమ హృదయాన్ని కరిగించి తమ్ము కర్తవ్యోన్ముఖు లుగా చేయగలిగిన అంతటి మహా కావ్యాన్ని రచించిన కవిని

ప్రత్యేకంగా అభినందించ తలుచుకొన్నారు ప్రజలు. అది సమంజసం అని అనిపించడంవల్ల ఏ సంకోచమూ లేకుండా తానుకూడా కానుకలు తీసుకొని ప్రజలతో పాటు బయలు దేరారు ప్రభువు.

ఆ సమయానికి రేఖ సహాయంతో తన పువ్వుల తోటలో తిరుగుతున్నారు కవి. ప్రభువూ ప్రజలూ రావడం చూసి కవి చెయ్యి వదిలేసి చెట్టుచాటుకి వెళ్ళిపోయింది రేఖ. కవి కంగారుగా "రేఖా! రేఖా!" అంటూ గాలిలో చేతులతో తడుముతున్నారు.

కవి దీనస్థితి చూసి ప్రభువుతో పాటు వచ్చిన ప్రజలంతా నిర్విణ్ణులయిపోయారు. "ఏమిటీ ఘోరం! ఎందుకిలా జరిగింది!" దుఃఖంతో ఒక్కరి నోటివెంటా మాట పెగిలి రావడంలేదు. బాధతో నిశ్చేష్టులై మ్రాన్పడి ఉండిపోయిన వాళ్ళందరినీ చూడడంతో, రేఖ హృదయంలో ఏర్పడిన ఆ గాయాన్ని మళ్లా ముల్లుతో రేపినట్లయింది. ఆ చెట్టువెనక నీడలో నిలబడిన రేఖ జీవితమే ఒక దట్టమైన క్రీనీడగా భాసించింది. ఆమెకి జరిగిన సంగతులన్నీ జ్ఞప్తికి రాసాగాయి.

అందులో ముఖ్యంగా ఆ శ్రావణ పౌర్ణమినాటి రాత్రి. ఆరాత్రి తన ఆనందచంద్రుడు, శాశ్వతంగా మేఘాలమాటుకి తప్పుకున్నాడు. లోకాని కంతకీ వెలుగు ప్రసాదించే ఆరాత్రి తన తలపై మాత్రం ఇంత చీకటిని గుమ్మరించిపోయింది.

ఆరాత్రి ఆ కవి మన ముఖం చూస్తేనే తనకి భయం వేసింది. కళ్ళు తెరవకుండానే ఆయన కావ్యం చెప్పారు

పోతున్నారు. ఆయన చెప్పింది యాంత్రికంగా రాస్తున్నా, మనస్సులో కొండంత భయం. ఆయన కన్నులు తెరవరేం? అందమైన ఆ కళ్ళు అలా మూసుకునే ఉన్నారేం? యెందుకో తెలియని భయం తనకి. ఇంతలో పరధ్యానంగా "ఏం చెప్పానూ" అన్నారాయన.

"మీరే చదవండి ఇవిగో" అంటూ అప్పటివరకూ రాసిన తాటాకులు ఆయనకి ఇవ్వబోయింది తను.

విషాదంతో కూడిన ఓ చిరునవ్వు నవ్వి ఆయన "పిచ్చిదానా! నీకింకా అర్థం కాలేదా? ఇప్పుడు నువ్వు భయ పడతావని దాస్తేమాత్రం ఏవయింది? తర్వాత అయినా తెలియకపోతుందా? విను. నాకిప్పుడు ఏమీ కన్పించడం లేదు. చంద్రుణ్ని చూస్తూంటే నా కిందాకా మెదడులో ఏదో తటిల్లతలా మెరిసినట్లయింది. అంతే! ఇంక నాకు చంద్రుడు కనిపించడం మానేశాడు. ఒక్క చంద్రుడే అన్న మాటేవిటి? ఈ లోకమే నాకు అదృశ్యమైపోయింది. ఇప్పుడు నాకీ పరిసరాలు కానీ నువ్వు కానీ ఇక్కడి వస్తువులు కానీ ఏవీ కనిపించడంలేదు. నాకు కనిపిస్తున్నదల్లా ఒక్కటే! అదే నా కావ్యంయొక్క సమగ్ర స్వరూపం!

"ఆఁ! ఏదీ ఇలా చూడండి" అంది తాను భయంతో కంగారుగా.

శబ్దం వచ్చిన దిక్కుగా ముఖంతిప్పి కళ్ళు తెరచారు ఆయన.

ఆ కళ్ళల్లో ఏముంది! కాంతి అంతా అంతరించి గాజు గుడ్లుగా మాత్రం మిగిలాయి అవి.

అంతే!

ఆ తర్వాత ఏం జరిగిందో తనకి తెలియదు.

స్పృహవచ్చి తను కళ్ళు తెరిచి చూసేసరికి కవి తన ముంగురులు సర్దుతున్నాడు.

"ఏమిటీ ఘోరం! మీ కళ్ళల్లో పూర్వం ఉన్న ఆ కాంతి ఏమైంది?" అంటూ ఏడ్చింది తను.

కొంత సేపటికిఆయన తనని ఓదార్చి "రేఖా! జరిగిన దానికి విచారిస్తూ కూచుంటే ఏం లాభం? తరువాత రాయి చెబుతా" అన్నారు.

"ఆయన చెప్పడం... నేను రాయడం...ఇంత దారుణంగా నా కోరిక నిజం అయింది" అంటూ పైట నోట్లో కుక్కుకొని చెట్టుచాటున మౌనంగా ఏడుస్తూ ఉండిపోయింది రేఖ.

ఎంతసేపటికీ రేఖ కనిపించక పోయేసరికి "రేఖా! రేఖా." అంటూ అటూ ఇటూ చేతులతో తడుముతూఉన్న కవికి ప్రభువు చేతులుతగిలాయి. వెంటనే ప్రభువు కవి రెండు చేతుల్నీ తన చేతుల్లోకి తీసుకొని పొంగివస్తూన్న దుఃఖాన్ని అణచుకుంటూ "ఏమిటీ దారుణం? కనులు కనిపించక అంధకారంలో తారట్లాడుతూన్న ఈ మహాదేశానికి దివ్య లోచనాల్ని ప్రసాదించిన మీరే ఇవాళ కనుల కాంతినికోల్పోయి అంధకారంలో పడిపోయారా?" అన్నారు.

కంఠస్వరాన్ని బట్టి వచ్చింది ప్రభువని గుర్తించి ఆయన చేతుల్ని తన దోసిట్లోకి తీసుకొని "తమరు దయ చేశారా? కబురు చెయ్యకపోయారా?" అన్నారు కవి.

దానికేం సమాధానం చెప్పకుండా "ఇలా ఎందుకు జరిగింది? ఎప్పుడు జరిగింది!" అన్నారు విషాదంగా ప్రభువు.

కవి నిర్లిప్తతో కూడిన చిరునవ్వునవ్వి "ప్రభూ! తమరు ఎరుగనిదేముంది? ఆత్మార్పణకూడా చేస్తేనేకాని యజ్ఞఫలం లభించదుకదా! లోకానికి వెలుగుఇచ్చే కావ్య జ్యోతి కావాలన్నారు మీరు. నా కళ్ళకాంతిని హారతి ఇస్తేనేకాని సరస్వతి ప్రసన్నురాలు కాలేదు. దానికేం అన్ని వేళలా శాంతినీ! అవసరమైనప్పుడు క్రాంతినీ వెదజల్లే దివ్య లోచనాలు నా ప్రజలకు నా కావ్యంవల్ల లభిస్తే అదే చాలు నాకు. నేను పోగొట్టుకున్న ఈ కాంతిరేఖకి బదులుగా, దేశీయులు ఋజుమార్గవర్తనులయారుకదా అనే కాంతిరేఖ నాకు శాశ్వతంగా మిగులుతుంది" అంటూన్న కవి కళ్ళలోనుంచి రెండు ఆనందభాష్పాలు. రాలాయి. లోకోప కారి అయిన ఆ యుగప్రవర్తకునకు అంజలిఘటించిప్రభువుతో పాటు ప్రజలుకూడా నిరుత్తరులై ఉండిపోయారు! కవి రేఖా మాత్ర సహాయుడై క్షితిజమువేపు సాగిపోతూంటడాన్ని ఉత్కంఠతో గమనిస్తూ.